క్లుప్తంగా

సింగల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు



తెనాలి అర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల్ని విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్లు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంగానమ్మపేటలోని ప్లాస్టిక్ విక్రయ దుకాణాల్లో బుధవారం తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పలు దుకాణాలకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా శానిటరి ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల్ని ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు.వాటిని విక్రయించినా, ఉపయోగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, అనుపమ, ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్య వైశ్య రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా కిశోర్



తెనాలి అర్బన్: ఆర్యవైశ్య రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా తెనాలి వాసి ఎం.వి.కె. కిశోర్, రాష్ట్ర ఈసీ మెంబర్‌గా కె పూర్ణనంద్ నియమితులయ్యారు. బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యనా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం వారికి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ఆనంతరం ఆర్యవైశ్య నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లా గురునాథగుప్త, నాయకులు వంకదారు శివసుధాకర్, గడవర్తి శ్రీసాయిహరేరామ్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ ఎస్‌ఐగా సుబ్బయ్య బాధ్యతల స్వీకారం



తెనాలి రూరల్: తెనాలి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వై. సుబ్బయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేశారు. ఎస్‌ఐగా ఉద్యోగోన్నతి పొంది గుంటూరు నల్లపాడులో ఏడాది పని చేశారు. అనంతరం ఒంగోలు ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తూ బదిలీపై తెనాలి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ కె. చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నగరంలో భారీ వర్షం



నెహ్రూనగర్: నగరంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం దాకా ఎండ కాసినప్పటికీ సాయంత్రం 4 గంటల తరువాత నుంచి మబ్బులు కమ్ముకొచ్చి, రాత్రి 7 గంటల దాకా వర్షం కురిసింది. దీంతో నగర వాసులు, వీధి వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వేళల్లో వర్షం కురియడంతో కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే వారు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. నగరంలోని పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి.

అమరవీరుల కుటుంబ సభ్యుల సమస్యలకు పరిష్కారం



నగరంపాలెం: పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యుల సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ (డీపీవో) ఆవరణలో అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. సమస్యల్ని ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), కె.కోటేశ్వరరావు (ఏఆర్) పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర ప్రభుత్వ సేవలే లక్ష్యం

- సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమన్వయంతోనే సాధ్యం
- 'వార్డులో ఒకరోజు'లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సచివాలయంలో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల్ని సత్వరం అందించాలనేది తన ఆశయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పని చేసినపుడే అది నెరవేరుతుందని చెప్పారు. పేదలకు సంతృప్త స్థాయిలో సంక్షేమం అందించాలని కృషి చేస్తున్నానని తెలిపారు. అంకితభావంతో పనిచేస్తూ, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వార్డులో ఒకరోజు పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బుధవారం పట్టణ ఆరో వార్డును సందర్శించారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయాల సిబ్బందితో సమావేశమయ్యారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజల్నుంచి వచ్చిన వినతులు, వాటి పరిష్కారంపై సమీక్షించారు. సచివాలయం పరిధిలో 16 వినతులు రాగా, వాటిలో పది పరిష్కారమైనట్టు సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వినతులు సాధ్యం కావని చెబుతూ, మరికొన్ని పెండింగులో ఉన్నాయని తెలిపారు. సాంకేతికంగా ఏవైనా చిన్న సమస్యలుంటే పరిష్కరించి, సంక్షేమాన్ని అందించాలని ఎమ్మెల్యే చెప్పారు. నిబంధనలకు పూర్తి భిన్నంగా ఉంటే ఆ కారణాన్ని వారికి తెలియజేయాలని సూచించారు. సమస్యలు పరిష్కారమైన అంశాలకు సంబంధించిన షేక్ పర్వీన్, మరొక మహిళతో ఎమ్మెల్యే నేరుగా ఫోనులో మాట్లాడారు. తమ సమస్యల్ని పరిష్కరించినందుకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల్ని సమీక్షించారు. రోడ్లు, డ్రెయిన్ల ప్రగతిని పనులవారీగా సమీక్ష చేశారు. వలంటీర్లతో సమన్వయం చేసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. వార్డు సచివాలయం గేటు చిన్నదిగా ఉందనీ, కొంచెం పెద్దది ఏర్పాటు చేయాలని సిబ్బంది కోరారు. వార్డులోని వలంటీర్లతో మాట్లాడిన ఎమ్మెల్యే వారి క్షేమసమాచారాల్ని ఆరా తీశారు. సామాజిక అంశాలపై మాట్లాడారు. వార్డులో పార్టీ ఇన్‌చార్జి పోతిరెడ్డి హేమలత, నాగరాజు కుటుంబసభ్యులతో కలసి భోజనం చేశారు. తర్వాత వార్డులోని ముఖ్య కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశమయ్యారు. పార్టీ పనితీరు, ప్రజల అభిప్రాయం, మరింత మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, పార్టీ ఇన్‌చార్జి పోతిరెడ్డి హేమలత, నాగరాజుతోపాటు నీలి అజయ్, బాకర్, కన్నెగంటి గోపీచంద్ పాల్గొన్నారు.

కొమ్మమూరు కాల్వకట్ట అభివృద్ధికి చర్యలు

- సచివాలయం–2 పరిధిలోనే రూ.25 కోట్ల సంక్షేమ లబ్ధి
- కొలకలూరులో రెండో రోజూ గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: కొమ్మమూరు కాల్వకట్ట అభివృద్ధికి చర్యలు చేపడతామని, కట్టపై నివసించే సంచార జాతుల ప్రజలకు ఇళ్ల స్థలాల్ని పంపిణీ చేస్తామని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హామీనిచ్చారు. రూరల్ మండలం కొలకలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండోరోజైన బుధవారం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వం తరఫున అందజేసిన సంక్షేమ లబ్ధిని వివరించారు. పలువురు ఆయా పథకాల లబ్ధిని పొందినట్టు వెల్లడించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా? అని ప్రశ్నించి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూరుస్తున్నట్టు ఎమ్మెల్యే శివకుమార్ గుర్తు చేశారు. కొలకలూరులోని సచివాలయం–2 పరిధిలోనే రూ. 25 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్టు చెప్పారు. అగ్రవర్ణ పేదల్ని ఆదుకోవడానికి ప్రభుత్వం కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల్ని అమలుచేస్తున్నట్టు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు దోసపాటి నాగదేవిక, కాలిశెట్టి ఫణి కుమార్, డీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాల గురవమ్మ, హాఫ్‌పేట సర్పంచ్ తలమాల ఎర్రయ్య, పార్టీ నాయకులు దూళ్ల శ్రీనివాసరావు, భర్తిపూడి బాపిరాజు, కొలకలూరు నాగేశ్వరరావు, పినపాటి అనిల్, మల్లవరపు బుల్లియ్య, విజయ్, ప్రసాదం రాధారావు, వీరమల్లు కార్తికేయ, తులాబందుల కోటేశ్వరరావు, అంచే రోశయ్య, రావూరి రవిబాబు, కాలిశెట్టి సుబ్బారావు, పోలిశెట్టి కోటేశ్వరరావు, మోర వెంకటేశ్వరరెడ్డి, కోటిరెడ్డి, లక్ష్మీరెడ్డి, వీరారెడ్డి, రోశిరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, కొలకలూరి రాజయ్య, నలుకుర్తి జోసఫ్, పామర్తి సుబ్బారావు, మల్లవరపు భరత్, పోలంకి దాసు, ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు, పంచాయతీ కార్యదర్శి వై.వి.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

దేశానికి ప్రకాశం పంతులు సేవలు మరువలేనివి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యసాగర్

తెనాలి అర్బన్: ఆంధ్ర కేసరి టంగుటూరు ప్రకాశం పంతులు దేశానికి చేసిన సేవలు మరువలేనివని పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సత్యసాగర్ కొనియాడారు. ప్రకాశం పంతులు జయంతిని కొత్తపేటలోని పెన్షనర్స్ హాలులో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యసాగర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు ఆశయాలకు అనుగుణంగా అంతా పని చేయాలని కోరారు. పెన్షనర్స్ అసోసియేషన్, తెనాలి అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ జీవితాన్ని దేశసేవ కోసం అంకితమిచ్చిన మహానుభావుడు ప్రకాశం పంతులు అని కొనియాడారు. సమావేశంలో కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, అజ్గర్ ఆలీ, లక్ష్మణరావు, గంటయ్య పాల్గొన్నారు.

– టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని బోసు రోడ్డులోని ఆయన విగ్రహానికి గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు, సినీ నటుడు వేమూరి విజయభాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన సేవల్ని కొనియాడారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయానికి తన వంతు సహకరించినట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. విశ్రాంత ఉద్యోగులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మించిన అన్నాబత్తుని సత్యనారాయణ మెమోరియల్ ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. అక్కడే సభలో మాట్లాడుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఎన్నికలముందు తనను కలసి, సంఘ కార్యాలయానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్టు గుర్తు చేసుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చాక, వారికి స్థలాన్ని కేటాయించినట్టు చెప్పారు. 500 మందికి పైగా విశ్రాంత ఉద్యోగులకు కార్యాలయం ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. సంఘ సభ్యులకు మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ శుభాభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ రీజియన్ అధ్యక్షుడు కేవీ సుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్ కుమార్, అధ్యక్షుడు ఎం.చలపతిరావు, కార్యదర్శి వి.రాఘవరావు, ఉపాధ్యక్షుడు వి.బ్రహ్మానందం, కోశాధికారి ఎం.బాబూరావు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఎం.హరిప్రసాద్ పాల్గొన్నారు.

వాడుక భాష పితామహుడు గిడుగు

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



గిడుగు జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవర ప్రసాద్

గుంటూరు వెస్ట్: తెలుగును వ్యవహారిక భాషగా తీర్చిదిద్దిన గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు కృషి మరువలేనిదని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవర ప్రసాద్ కొనియాడారు. గిడుగు జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలసి నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ భాషకు లేని అద్భుతమైన పద్యాలు, కవి సమ్మేళనాలు తెలుగు భాష సొంతమని పేర్కొన్నారు. ఉపాధి కోసం ఇతర భాషలు నేర్చుకోవచ్చని, మాతృభాష మాత్రం తల్లితో సమానమని పేర్కొన్నారు. జేసీ రాజకుమారి మాట్లాడుతూ గిడుగు జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 29 వరకు తెలుగు భాషా వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చిన్నారులకు, యువతకు వ్యాస రచన, వక్తృత్వం, తెలుగు పద్యాల్లో పోటీలు నిర్వహించి, ఈ నెల 26న బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. అనంతరం గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, గుంటూరు ఆర్డీవో ప్రభాకరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించిన మనోహర్, అధ్యాపకులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్యదర్శి కె. ఝాన్సీలక్ష్మి, గ్రంథ పాలకులు కె. చిన్నపరెడ్డి, ఎన్. నాగిరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

- పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి జె.వి. సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్. జయశైలజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో నివాళి

లక్ష్మీపురం: భారతీయుడి ఆత్మగౌరవానికి, తెలుగువాడి ఆత్మస్థైర్యానికి, ఆంధ్ర పౌరుషానికి నిలువెత్తు నిదర్శనం టంగుటూరి ప్రకాశం అని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్. మూర్తి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు జయంతిని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ అనుక్షణం ప్రజల కోసమే జీవించిన టంగుటూరి నూటికి నూరు శాతం ప్రజా నాయకుడుగా వెలుగొందిన ధీరోదాత్తుడు, త్యాగధనుడని కొనియాడారు. సీనియర్ సిటిజన్స్ నాయకులు ఎస్.తిరుపతయ్య మాట్లాడుతూ తెలుగు వారంత గర్వంగా ఆంధ్ర కేసరి అని పిలుచుకునే ప్రకాశం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సీనియర్ ఇంజనీర్ పి.ఘనశ్యామాచార్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు.

విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి



ఆహారాన్ని స్వయంగా రుచి చూస్తున్న ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి

తెనాలి రూరల్: విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసమే మెనూలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకువచ్చారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ జి. దేవి తెలిపారు. తెనాలి పట్టణ ఆర్‌ఆర్ నగర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించడంతో పాటు స్వయంగా రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల్ని వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్రంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత సంతృప్తికరంగా ఉందని తెలిపారు. అనంతరం పెదరావూరు జెడ్పీ హైస్కూలుకు వెళ్లారు. అక్కడ ఎక్కువ మంది విద్యార్థులు ఇళ్ల నుంచే భోజనం తీసుకురావడంపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఆహార నాణ్యత సరిగా లేదని, ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకుని మెరుగుపర్చాలని ఫుడ్ కమిషన్ మెంబర్ ఆదేశించారు. ఆమె వెంట జిల్లా పౌరసరఫరా అధికారి కోమలి పద్మ, ఏఎస్‌డబ్ల్యూవో జి. శైలజ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వి. భిక్షాలు, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, తూనికలు కొలతలు, ఐసీడీఎస్ అధికారులు, వివిధ హాస్టళ్ల వార్డెన్లు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: షాపుల్లో చోరీ కేసుల్లో నిందితుడ్ని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల అరండల్‌పేట పరిధిలోని రెండు షాపుల్లో చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన దుద్దాడ లింగంను అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం అరెస్టు చేసి నిందితుడి నుంచి రూ. 9వేలు స్వాధీనం చేసుకున్నారు.

• జయహో భారత్ !



మున్సిపల్ బాయ్స్ హైస్కూలులో విక్రమ్ ల్యాండింగ్‌ను టీవీలో వీక్షిస్తున్న విద్యార్థులు



టీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూలులో..

తెనాలి అర్బన్: చంద్రయాన్–3 ల్యాండింగ్ ప్రక్రియను తెనాలి పట్టణంలోని పలు మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు బుధవారం సాయంత్రం వీక్షించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన టీవీలలో చంద్రునిపై విక్రమ్ సురక్షితంగా ల్యాండ్ కావడాన్ని వీక్షించి జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మున్సిపల్ బాయ్స్ హైస్కూలులో విక్రమ్ ల్యాండింగ్‌ను టీవీలో వీక్షిస్తున్న విద్యార్థులు



బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్‌లో..



ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో..

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

పట్నంబజారు: యువతి వెంటపడి వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయిగూడెం మండలానికి చెందిన సంధ్య నాజ్ సెంటర్‌లోని డీమార్ట్‌లో పని చేస్తోంది. టెలిగ్రామ్ ద్వారా దుర్గాప్రసాద్ పరిచమయ్యాడు. ఇద్దరూ కొద్దిరోజులు సన్నిహితంగా మెలిగారు. సంధ్యకు దుర్గాప్రసాద్ ప్రవర్తన నచ్చకపోవడంతో ఇటీవల దూరంగా ఉంటోంది. అయినప్పటికీ దుర్గాప్రసాద్ వెంటపడి ప్రేమించాలంటూ వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలు బుధవారం పోలీసుల్ని ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐ కుటుంబానికి చెక్కు పంపిణీ

నగరంపాలెం: జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన వి.వెంకట్రావు అనారోగ్యంతో ఈ ఏడాది ఫిబ్రవరి 16న మరణించారు. ఈ మేరకు వెంకట్రావు భార్య శ్రీదేవికి లక్ష రూపాయల కార్పస్ ఫండ్ చెక్కుని బు ధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), కె.కోటేశ్వరావు (ఏఆర్) పాల్గొన్నారు.

ఘనంగా కళా విపంచి వార్షికోత్సవం



వడ్లమాని రవి దంపతులను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా బుధవారం కళా విపంచి 17వ వార్షికోత్సవం, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభకు ప్రముఖ గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు, జస్టిస్ సి. మానవేంద్రనాథ్‌రాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాతత్పరులు డాక్టర్ వడ్లమాని రవి, ఆదర్శ దంపతులకు ఆంధ్ర కేసరి విశిష్ట సేవా పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ సోమయాజులు మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా సేవాతత్పరులు వడ్లమాని రవికి పురస్కారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు బొప్పన నరసింహారావు పర్యవేక్షించారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు, భాస్కర్‌రామ్, అట్లూరి నారాయణరావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యల పరిష్కారానికి వినతి

తెనాలి: యానిమేటర్ల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని సంఘ గౌరవాధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెనాలి మండల యానిమేటర్ల సమావేశం బుధవారం అరుణ అధ్యక్షతన నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యానిమేటర్లకు రూ.26 వేల చొప్పున వేతనం ఇవ్వాలని, మూడేళ్ల కాలపరిమితి, 45 సంవత్సరాల వయో పరిమితిని రద్దుచేయాలని కోరారు. స్వయం సహాయక గ్రూపుల్లో జరిగిన అవకతవకలకు యామినేటర్లనే బాధ్యులుగా చేయడం తగదన్నారు. రాజకీయ వేధిపులు ఆపాలనీ, యానిమేటర్లకు జీతాలను వారి వ్యక్తిగత ఖాతాలోనే జమచేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30వ తేదీ వరకు జరిగే జీపు జాత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అర్హత ప్రకారం సీసీలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. అనంతరం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా అరుణకుమారి, కార్యదర్శిగా హనుమాయమ్మ, కోశాధికారిగా సత్యవతి, ఉపాధ్యక్షులుగా పూర్ణకుమారి, శశికళ, గౌరవ అధ్యక్షుడిగా షేక్ హుస్సేన్‌వలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి సమస్యలతో వినతిపత్రాన్ని ఎంపీడీవో, ఏపీఎంకు అందజేశారు.